ఓట్ల లెక్కింపుపై తీవ్ర ఉత్కంఠ

- రేపే ఎన్నికల ఫలితాలు
- ఎక్కడ చూసినా అదే చర్చ
- విజయంపై ఎవరి ధీమా వారిది

కొత్తపేట: అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న తరుణంలో కొత్తపేట నియోజకవర్గ ఓటర్ల తీర్పు కోసం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రాజకీయ వర్గాలు, విశ్లేషకులే కాదు ఎక్కడ ఏ ఇద్దరు కలిసినా విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపైనే చర్చలు, విశ్లేషణలు జోరుగా కొనసాగుతున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపులో భాగంగా జిల్లాలోని 7 నియోజకవర్గాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఓట్ల లెక్కింపు ముమ్మిడివరం సమీపాన చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఆ మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో ఆర్‌ఓలు, ఇతర అధికారులు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మొత్తం పోలైన ఓట్లు 2,14,975

నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో మొత్తం ఓటర్లు 2,52,383 మంది కాగా వారిలో 2,14,975 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో 1,07,762 మంది పురుషులు, 1,07,210 మంది మహిళలు, ఇతరులు ముగ్గురు ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్స్ 2,177 కాగా సర్వీస్ ఓటర్స్ 95 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఆత్రేయపురం మండలం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం

నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక ఒకటో నంబర్ పోలింగ్ బూత్ (పీఎస్) నుంచి ప్రారంభిస్తారు. ర్యాలి 62వ పీఎస్‌తో 5 వ రౌండ్‌లో ఆ మండలం ఓట్ల లెక్కింపు ముగుస్తుంది. తరువాత రావులపాలెం మండలం ఊబలంక 63వ నెంబర్ పీఎస్ నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ముమ్మిడివరప్పాడు 134వ పీఎస్‌తో ఆ మండలంలో 72 పీఎస్‌ల ఓట్ల లెక్కింపు 10వ రౌండ్‌లో ముగుస్తుంది. తదుపరి కొత్తపేట మండలంలో కొత్తపేట 135 వ పీఎస్ నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై అవిడిలో 200వ నంబర్ పీఎస్‌తో ఆ మండలంలో 66 పీఎస్‌ల ఓట్ల లెక్కింపు 15 వ రౌండ్‌లో పూర్తవుతుంది. చివరగా ఆలమూరు మండలంలో ఆలమూరు 201 పీఎస్ నుంచి ప్రారంభమై జొన్నాడ 262 పీఎస్‌తో ఆ మండలంలో 62 పీఎస్‌లలో ఓట్ల లెక్కింపు చివరి 19వ రౌండ్‌లో ముగుస్తుంది. దాంతో తుది ఫలితం వెలువడుతుంది.



చెయ్యేరులో కౌంటింగ్ సెంటర్ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అంబాజీపేటలో..

అంబాజీపేట: సార్వత్రిక ఓట్ల లెక్కింపు దగ్గర పడడంతో అన్ని పార్టీల నాయకులు, పందెం రాయుళ్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరో పక్క మంగళవారం కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 2019 ఏప్రిల్ 11న ఎన్నికలు జరగ్గా, వాటి ఫలితాలు కోసం 41 రోజుల పాటు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి 21 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇంకా కౌంటింగ్‌కు మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఇదిలా ఉంటే పోలింగ్ సరళిని బట్టి ఇప్పటికీ పోటీలో నిలిచిన అధికార, విపక్ష పార్టీల వారీగా తమకు వచ్చే ఓట్లపై అంచనాలు వేస్తున్నారు. ప్రజలు కౌంటింగ్ రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరో పక్క గ్రామాలు, మండలాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. పోటీల్లో నిలిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయవకాశాలు, వారి మెజార్టీలపైన, అధికారంలోకి ఏ పార్టీ వస్తుందనే దానిపై పందెం రాయుళ్ల భారీ బెట్టింగులు కడుతున్నారు.

కౌంటింగ్ సజావుగా జరిగేలా సహకరించాలి



నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు పూర్తిగా సహకరించాలి. కౌంటింగ్ కేంద్రం వద్ద సీఆర్‌పీఎఫ్, ఆర్మ్‌డ్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశాం. కౌంటింగ్ హాలుకు ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, 144 సెక్షన్‌తో పాటు నిషేధాజ్ఞలు కూడా అమలులో ఉంటాయన్నారు. విజయోత్సవాలు, బాణసంచా కాల్పులకు అనుమతులు లేవు. 3, 4 తేదీల్లో బ్రాందీ షాపులు క్లోజ్ చేసేలా చర్యలు తీసుకున్నాం. పోటీలో గెలుపోటములు సహజం. జయాపజయాలను అందరూ స్పోర్టివ్‌గా తీసుకోవాలి. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవు.

– జీవీవీ సత్యనారాయణ, ఆర్డీవో, ఆర్ఓ, కొత్తపేట

క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు భారీ విరాళం



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన గల్లా పవన్‌కుమార్, హనీషా దంపతులు, గల్లా నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. భారీ విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు స్వామి వారి ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు దాత కుటుంబాలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

అనారోగ్య బాధితుడికి రూ.50 వేల సాయం



సాయిబాబుకు ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

మలికిపురం: గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన బొక్కా సాయిబాబుకి సంస్థ ప్రతినిధులు కడలి ఈశ్వరి, గుబ్బల శ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన సాయిబాబుకు అత్యవసర ఆపరేషన్ చేయించడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబ దాతల సాయం కోరడంతో ఈ మేరకు అందించినట్టు సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్ తెలియజేశారు. కార్యక్రమంలో కడలి ఈశ్వరి, తొత్తరమూడి గ్రామ పెద్ద మట్టపర్తి రామారావు, సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్ , చెల్లుబోయిన సుబ్రహ్మణ్యం, బైరిశెట్టి వెంకటరమణ, కట్టా శ్రీను, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీ

మలికిపురం: కేశనపల్లి హైస్కూల్ నుంచి కరవాక వరకూ సోమవారం ఉదయం 6 గంటలకు ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా భారీ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త బోనం రాజు ఆదివారం తెలిపారు. సైక్లిస్ట్ డాక్టర్ జాన వీరభద్రప్రసాద్, సైక్లిస్ట్ డాక్టర్ కుందెం మహాలక్ష్మి శ్రీనివాస్, సైక్లిస్ట్ డాక్టర్ కేఎస్‌వీ శ్రీనివాసరావు, సైక్లిస్ట్ దెందుకూరి రాంబాబురాజు ఉచిత అంబులెన్స్ నిర్వాహకులు తదితర ప్రముఖులు ర్యాలీలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

రోడ్డు వేయరూ..



వినాయక వీధిలో రహదారి వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

అంబాజీపేట: మాచవరం మేజర్ పంచాయతీలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఆ కాలనీకి దశాబ్దాల కాలంగా రహదారి సౌకర్యం లేదు. రహదారి నిర్మించాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదు. స్థానిక హైస్కూల్ సమీపాన వినాయక వీధిలో సుమారు 50 కుటుంబాల వారు ఉంటున్నారు. ఇటీవల ఈ కాలనీ అన్ని రకాలుగానూ అభివృద్ధి చెందుతుంది. కొత్త భవనాల నిర్మాణంతో పాటు లేఅవుట్లు వేస్తున్నారు. ఇక్కడ డ్రైనేజీ, రహదారి సౌకర్యం లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో పంచాయతీ పాలకులు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే కొంత మంది ఈ రహదారితో సహా భూములు కొనుగోలు చేశామని రోడ్డుకు అడ్డుపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి నిధులు మంజూరుకు అంగీకరించినా రహదారి మార్గం తమదేనంటూ స్థానికంగా ఒకరు అభ్యంతరం చెప్పడంతో రహదారి నిర్మాణం నిలిచిపోయింది. ప్రతిసారీ ఏదో ఒక కారణంతో రహదారి నిర్మాణ పనులు అడ్డుకోవడం పై ఆగ్రహించిన స్థానికులు, మహిళలు రోడ్డుకు అడ్డంగా కర్రలు పాతి రాకపోకలను నిలువరించారు. అలాగే తమ వీధికి రహదారి నిర్మాణం చేపట్టాలని నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.

బాక్సింగ్ చాంపియన్ అశోక్‌కు ఆర్థిక సాయం



మల్లాడి కృష్ణారావు సమక్షంలో ఆర్థిక సాయం అందిస్తున్న అగ్నికుల క్షత్రియ నాయకులు

రాజోలు: ఇంటర్నేషనల్ మౌథాయి బాక్సింగ్ చాంపియన్ కొల్లాటి అశోక్‌కు అంతర్వేది మహా గజమాల వ్యవస్థాపకుడు చింతా మహానాగరాజు రూ.60 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ నెల 19 నుంచి 23 తేదీ వరకు నార్త్ అమెరికా లోవా సిటీలో జరిగే మౌతా యి బాక్సింగ్ 86 కేజీల విభాగ పోటీల్లో అశోక్ పాల్గొంటున్నారని మహా నాగరాజు వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు సుమారు రూ.7.50 లక్షల ఖర్చవుతుందని అందుకే రాజోలు నియోజకవర్గ అగ్ని కుల క్షత్రియుల ఆధ్వర్యంలో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారా వు పుట్టిన రోజున రూ.75 వేల సాయం అందజేస్తారని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. మౌథాయి బాక్సింగ్ పోటీల్లో అశోక్ భారత దేశ ఖ్యాతిని నిలబెడతాడన్నారు. క్రీడాభిమానులంతా అశోక్‌కు అండగా నిలవాలని కోరారు. రాజోలు నియోజకవర్గ అగ్నికుల క్షత్రియుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

మలికిపురం: ఈ నెల నాలగో తేదీ అమలాపురంలో జరిగే ఓట్ల కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. ఆదివారం మలికిపురంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అమరావతి నుంచి పార్టీ నేత ప్రభుత్వం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో కౌంటింగ్ ఏజెంట్లతో టెలీ కాన్ఫరెన్స్ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాపాక, గొల్లపల్లి మాట్లాడుతూ ఏజెంట్లు పార్టీ నేతల సూచనలు పాటిస్తూ అధికారుల నిబంధనల మేరకు నడుచుకుంటూ అనుమానాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నిర్దేశించిన సమయానికే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీ రావు, కడలి శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, నాయకులు గొల్లపల్లి శ్రీధర్, కేఎస్ఎన్ రాజు, జంపన బుజ్జిరాజు, ముప్పర్తి త్రిమూర్తులు, సూరిశెట్టి బాబి, అప్పారి హరిబాబు, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

వైభవంగా సత్తెమ్మ సంబరం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంలో కొలువుదీరిన సత్తెమ్మ సంబరం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, తీన్మార్ విన్యాసాలు, భక్తుల కోలాహలం నడుమ సంబరాన్ని ఆద్యంతం కనుల పండువలా జరిపించారు. రెండేళ్లకోసారి నిర్వహించే సంబర మహోత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. సాధారణంగా అమ్మవార్ల సంబరాలు రాత్రి సమయాల్లో నిర్వహిస్తారు. కానీ దానికి భిన్నంగా ఇక్కడ మధ్యాహ్నం నుంచి సంబరం నిర్వహించడం విశేషం. విజయనగరం మహిళల కోలాటం, కర్రసాము సంబరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సత్తెమ్మ తల్లి సంబరంలో గ్రామంలో కోలాహలం నెలకొంది.



సత్తెమ్మ తల్లి

నేడు రావులమ్మ జాతర

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజేశ్వరి రావులమ్మ అమ్మవారి జాతర సోమవారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలను గత నాలుగు రోజులు నుంచి అమ్మవారికి ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించనున్నామన్నారు.

కొబ్బరి రైతులతో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు

మామిడికుదురు: కొబ్బరికి జాతీయ స్థాయిలో వాణిజ్య పంటగా గుర్తింపు తీసుకురావడంతో పాటు కొబ్బరి ఉప ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ వ్యాపారాలతో అనుసంధానం చేసే విధంగా పది రాష్ట్రాల ప్రతినిధులతో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. బెంగళూరులో జాతీయ కన్సార్టియం ఫర్ కోకోనట్ స్టేక్ హోల్డర్స్ అనే సంస్థలో ఎగ్జిక్యూటివ్ కమిటీని రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కమిటీలో బెంగళూరుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ మనోహర్ వస్కీ గౌరవాధ్యక్షుడిగా, తమిళనాడుకు చెందిన చెల్లాదురై కో–ఆర్డినేటర్‌గా, కేరళకు చెందినన రే మణి గోపాలకృష్ణన్ ట్రెజరర్‌గా, ఆంధ్రప్రదేశ్ నుంచి మామిడికుదురుకు చెందిన నయనాల వేణుగోపాల్ కన్వీనర్‌గా, మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు చెందిన వేగి వెంకటేశ్వరరావు కో–కన్వీనర్‌గా నియమితులయ్యారు. కన్వీనర్ వేణుగోపాల్, కో–కన్వీనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని కొబ్బరి సాగు చేసే 12 రాష్ట్రాల్లో కొబ్బరి పంట సాగు, దిగుబడులు, కొబ్బరిని ఆశించే తెగుళ్లు, విలువ హెచ్చింపు, రైతుల ముఖ్యమైన సమస్యలపై జాతీయ స్థాయిలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, ప్రభుత్వ మరియు పరిశోధక సంబంధిత వ్యవస్థలతో అనుసంధాన ప్రాత పోషించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు.



నూతనంగా ఏర్పడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కొత్తపేట: నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినప్పటికీ కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారికి పోలీసు యంత్రాంగం అండగా ఉంటుందని అవగాహన కల్పించేందుకు ఆదివారం సాయంత్రం డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ ప్రజలకు కళ్లకు కట్టినట్టు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమణ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న ఓట్ల లెక్కింపు, పార్టీల జయాపజయాలు నేపథ్యంలో రాజకీయ పార్టీల కార్యకర్తలు, అల్లరి మూకలు పోలీసు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో జరిగే ప్రతి అల్లర్లకు, నేరాలకు కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఒక్కోసారి ఈ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ శూన్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సారథి, సీఐలు ఎం.రామ్‌కుమార్, సీఐ జేమ్స్‌రత్నాకర్, ఎస్సైలు శ్రీను నాయక్, ఎం.అశోక్, శ్రీనివాస్, జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దు

ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజకీయ పార్టీ నేతలు, కార్యకర్తలు సంయనం పాటించాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని ఆలమూరు ఎస్సై ఎల్. శ్రీను నాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల నాలుగున జరుగుతున్న లెక్కింపు సందర్భంగా మండలంలో సెక్షన్ 144, సెక్షన్ 30 అమలులో ఉందన్నారు. కావున ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించి పోలీసుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. అలాగే విజయం సాధించిన పార్టీలు ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పి.గన్నవరం: మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 2000 సంవత్సరానికి ముందు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులతో 'అమ్మ ఫౌండేషన్'ను ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు యర్రా శేష కుమారి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు విచ్చేసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం

పోతవరం ప్రాథమిక పాఠశాలలో చదువుకుని 'మెట్రో కెమ్ ఏపీఐ' సంస్థను స్థాపించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన పాఠశాల పూర్వ విద్యార్థి, గ్రామానికి చెందిన డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ)ని పూర్వ విద్యార్థులు అభినందించారు. వెంకటేశ్వర రావు, విజయలక్ష్మి దంపతులను అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కోనసీమలోని ఎన్నో దేవాలయాలకు, క్రీడాకారులకు, విద్యాలయాల అభివృద్ధికి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారం అందిస్తున్నారని వారు ప్రశంసించారు. తాను చదువుకున్న పాఠశాలకు ఆయన అందించిన రూ.3.5 లక్షల విరాళంతో షెడ్డు నిర్మాణం, ఫర్నిచర్, కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ అధ్యక్షురాలు శేషకుమారి తెలిపారు. పోతవరం గ్రామ సచివాలయానికి వెంకటేశ్వరరావు అందించిన రూ.5 లక్షల విరాళంతో ఫర్నిచర్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వీటిని ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పి.రాజారావు, పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



పోతవరంలో మెట్రో కెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

భారీ అన్నసమారాధన

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కృష్ణుడి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఈ అన్న సమారాధన జరిగింది. పిండివంటలతో ఏర్పాటు చేసిన ఈ అన్నసమారాధనలో పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు ఐదు వేల మంది పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద నిర్వాహకులు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

యోగాతో ఆత్మస్థైర్యం


అంబాజీపేట: విద్యార్థి దశ నుంచే యోగా శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందని, అందుకు అనుగుణంగా మేధాశక్తి పెరుగుతుందని అంబాజీపేట స్వామి వివేకానందా యోగా ఆశ్రమ గురువు శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు యోగా చేయించి, నీతి కథలు చదివించి, జాతీయ గీతాలను పాడించారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం ఆసక్తి పెంచుకోవాలన్నారు

భారీ వర్షంతో రహదారులు ఛిద్రం


మామిడికుదురు: రెండు రోజుల నుంచి మామిడికుదురు మండల వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. ఈ భారీ వర్షంతో రహదారులు అధ్వానంగా మారాయి. పాశర్లపూడిలోని 216వ నంబర్ జాతీయ రహదారి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌కు కూత వేటు దూరంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో జాతీయ రహదారిపై భారీగా గోతులు ఏర్పడ్డాయి. అక్కడ రోడ్డు అగాధంలా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 200 మీటర్ల మేర జాతీయ రహదారి దారుణంగా పాడైపోవడంతో వాహనాలు ఉయ్యాలా, జంపాల అన్న తరహాలో తీవ్ర భయం, భయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలు ఖరీఫ్ పంట సాగుకు ఎంతో ఉపయోగపడతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి తోటలకు భారీ వర్షం వల్ల కొబ్బరి తోటలకు సైతం మేలు జరుగుతుందని రైతులు పేర్కొన్నారు.

దోబూచులాడుతున్న వరుణుడు

అంబాజీపేట: గత కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపం చూపడంతో అల్లాడిన ప్రజలు శని, ఆదివారాల్లో వేకువజాము నుంచి ఉదయం 8 గంటల వరకు ఆకాశంలో కారు మబ్బులు కమ్మేయడం, కొద్దిపాటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఊపిరి పీల్చుకున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న మధ్యాహ్న సమయానికి భానుడు తన ప్రతాపాన్ని చూపడం, వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో తీవ్ర ఉక్కపోతకు గురై వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి సమయంలోను అధిక ఉష్ణోగ్రతలకు తోడు, ఉక్కపోత అధికంగా ఉంటుంది. అప్పటికప్పడే వాతావరణంలో మార్పులు సంభవించి చినుకులు పడటం , అనంతరం ఒక్కసారిగా వాతావరణం వేడెక్కడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రెండు రోజులు పాటు అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేయడంతో వర్షాలు పడితే వాతావరణం చల్లబడుతుందని ప్రజలు భావిస్తున్నారు.



భారీ వర్షానికి పాశర్లపూడిలో అధ్వానంగా మారిన జాతీయ రహదారి



అంబాజీపేటలో ఉదయం 6 గంటలకు మబ్బులతో నిండిన ఆకాశం